క్లుప్తంగా

28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

అలంపూర్: మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ హాజరువుతున్నట్లు చెప్పారు. సమావేశంలో 2023–24 అంచనా బడ్జెట్, 2022–23 సవరణ బడ్జెట్‌పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక

అయిజ: పట్టణంలో ఆదివారం ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఉప్పల ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చిన్నతాండ్రపాడు రంజిత్, సందీప్ కుమార్, ఉప్పల క్యాంప్ ప్రవీణ్, హనుమన్న, ప్రధాన కార్యదర్శిగా సంధ్యపోగు రవి, జాయింట్ సెక్రెటరీలుగా మహేష్, రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లవన్, విజయ్, సురేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ అరుణ్‌కుమార్‌కు జ్ఞాపిక

కందనూలు: జిల్లా కేంద్రానికి చెందిన కవి ఫిజిక్స్ అరుణ్‌కుమార్‌కు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నగర జలమండలి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్‌లు సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జల పరిరక్షణ కవితోత్సవం కార్యక్రమంలో కళావేదిక జాతీయ సహాయ కార్యదర్శి, కవి ఫిజిక్స్ అరుణ్ కుమార్‌ను శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్నం రాజేందర్ రెడ్డి, గాంధీ పుస్తకాల రచయిత డాక్టర్ వేణుగోపాల్ సత్కరించారు. ఈ సందర్భంగా వార్ ఫర్ వాటర్ అనే శీర్షికతో చదివిన కవితలో భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాలను బతికించాలని, ఐక్యరాజ్య సమితి నేటి సంవత్సరం నినాదం అయిన 'మార్పు వేగవంతం చేయాలనే' స్ఫూర్తితో ప్రతి ప్రపంచ పౌరుడు పర్యావరణం, ప్రకృతితో బాధ్యతగా ఉంటూ, నీటిని పొదుపు చేయాలని, కేర్ ఫర్ వాటర్, సేవ్ వాటర్, వాటర్ మనందరికీ లైఫ్ పార్ట్‌నర్ అంటూ సందేశాన్నికి ఈ జ్ఞాపిక అందజేశారని ఆయన పేర్కొన్నారు.

త్రైతసిద్ధాంత గ్రంథాల అందజేత



కేటీదొడ్డి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా జిల్లా అధ్యక్షుడు తాన్యనియక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలదిన్నె వాగుతండా భగవద్గీత ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల గ్రంథాలను ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు భగవద్గీతలోని శ్లోకాలు వాటి భావాలు వినిపించారు. కార్యక్రమంలో సభ్యులు రాములు, ఖలీల్, ప్రసాద్, కృష్ణమూర్తి, జనార్దన్, కొండయ్య, చిట్టెమ్మ, సౌమ్య, నర్సమ్మ, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళల శ్రేయస్సుకు ప్రత్యేక శిక్షణ

ఉండవెల్లి: మండల కేంద్రంలో గ్రామాలయ(వీఎస్‌టీ) సంస్థల సంయుక్త సహకారంతో ఈ నెల 20 నుంచి 28 వరకు నాలుగు గ్రామాల్లో 'రుతుస్రావం సంబంధిత ఆరోగ్య పరిశుభ్రత' అనే అంశంపై అవగాహన కల్పించి ప్రతి గ్రామంలో 50 మంది మహిళలకు ఉపాధి కల్పించారు. గ్రామాలయ సంస్థ శిక్షకులు రామచంద్రన్, కాళ్లకురి నాగవెంకట భాను ఆధ్వర్యంలో మహిళలకు రుతుస్రావం పీల్చుకునే గుడ్డతో తయారు చేసే ప్యాడ్ల తయారీ శిక్షణ తరగతులు వారం రోజుల పాటు 300 మంది మహిళలకు, ఉండవెల్లి, భైరాపురం, తక్కశీల, బస్వాపురం గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేఖ, గ్రామాలయ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎలాంగోవ్, మొనిటోరింగ్ అధికారులు జాకీర్ మొహమ్మద్, శిక్షకులు మణికంఠన్, రవిత, పర్వీన్, లక్ష్మి, ఫర్జానా భేగం తదితరులు పాల్గొన్నారు.



చెక్‌డ్యాంలకు మరమ్మతులేవీ?

- 2002లో నిర్మాణం
- 2009లో వచ్చిన వరదలకు శిథిలం
- నేటికీ పట్టించుకోని అధికారులు



అయిజ పెద్దవాగులో శిథిలమైన చెక్‌డ్యాం

అయిజ: భూగర్భ జలాలు పెంచే ఉద్దేశంతో వర్షపునీటిని ఒడిసిపట్టి, వాగులు, వంకల్లో నిల్వ చేసేందుకు 2001లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చెక్‌డ్యాంలను నిర్మించింది. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.5 లక్షలు ఖర్చు చేశారు. 2009లో వచ్చిన వరదలకు అలంపూర్ నియోజకవర్గంలోని చెక్‌డ్యాంల సైడ్‌వాల్స్ కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు వాటిని పునర్నిర్మించలేదు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. అయిజ శివారులో మొత్తం 4 చెక్ డ్యాంలు ఉండగా.. వాటిలో రెండు శిథిలమయ్యాయి. అదేవిధంగా మానవపాడు మండలంలోని కలుకుంట్ల, మానవపాడు, కొరివిపాడు, జల్లాపూర్, పల్లెపాడు, చందూర్, చిన్న పోతులపాడు, గోకులపాడు, బొరవెల్లి, పెద్ద పోతులపాడు గ్రామ శివార్లలో కలిపి మొత్తం 13 చెక్ డ్యాంలు నిర్మించారు. వాటిలో 2 చెక్‌డ్యాంలు శిథిలమయ్యాయి. ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం– సాతర్ల గ్రామాల మధ్య ఒకే చెక్ డ్యాం ఉంది. అది కూడా శిథిలావస్థలో ఉంది. కొత్తగా వల్లూరు సమీపంలో మరొక చెక్‌డ్యాం నిర్మాణానికి మంజూరు లభించింది. వడ్డేపల్లి మండలంలోని బుడమర్సులో 2 చెంక్ డ్యాంలు ఉన్నాయి. రెండు చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ మండలంలో కొత్త చెక్‌డ్యాంలకు మంజూరు రాలేదు.

సంతోషం ఎంతోకాలం నిలువలేదు.

చెక్‌డ్యాంలు నిర్మించినప్పటి నుంచి కొన్ని సంవత్సరాల పాటు అలంపూర్ నియోజకవర్గంలోని వాగుల్లో వర్షాకాలం సమృద్ధిగా నీరు నిలిచి చుట్టుపక్కల భూగర్భ జలాలు పెరిగాయి. బోరుబావుల్లో తాగునీరు, సాగునీరు సమృద్ధిగా లభించింది. మూగజీవాల దాహం తీర్చేందుకు ఈ చెక్‌డ్యాంలు ఉపయోగపడ్డాయి. ఈ సంతోషం ప్రజలకు ఎంతో కాలం నిలువలేదు. 2009లో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లాయి. దాంతో చెక్ డ్యాంల సైడ్‌వాల్స్ తెగిపోయాయి. చెక్‌డ్యాం కట్టడాలు శిథిలమయ్యాయి. వాటికి మరమ్మతు చేపట్టకపోవడంతో అప్పటి నుంచి ఇప్పటివరకు వాగుల్లో నీరు నిలువని పరిస్థితి ఏర్పడింది. కనీసం పశువులు దాహం తీర్చుకోవడానికి కూడా నీరు నిలువకపోవడం దురదృష్టకరం. వర్షాకాలంలో వాగులు ఎడారిని తలపిస్తున్నాయి. శిథిలమైన చెక్‌డ్యాంలకు మరమ్మతు చేయించాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నా.. ఫలితం లభించడం లేదు. ఉన్నతాధికారులు, పాలకవర్గం స్పందించి చెక్‌డాంలన్నింటికి మరమ్మతు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా నూతనంగా మంజూరైన వాటిని వెంటనే నిర్మించి, మరికొన్ని చెక్‌డ్యాంలు నిర్మించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ప్రతిపాదనలు పంపుతాం..

గతంలో నిర్మించిన చెక్‌డ్యాంల సైడ్‌వాల్స్ భారీ వర్షాలకు తెగిపోయి నీరునిల్వ లేకపోవడం వాస్తవం. చెక్‌డ్యాంలను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. చెక్‌డ్యాంలను పునర్నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపుతాము. నిధులు మంజూరైన వెంటనే చెక్‌డ్యాంలకు మరమ్మతు చేపడుతాము.

– విజయకుమార్‌రెడ్డి, ఆర్డీఎస్ ఈఈ

నీరు నిల్వ ఉండటం లేదు..



భారీ వర్షాలకు పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాంల సైడ్‌వాల్స్ 2009లో కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి వాగులో చుక్క నీరు నిలవడం లేదు. కనీసం పశుపక్షాదులు దాహం తీర్చుకోవడానికి నీరు లేకుండా పోయింది. వాటికి మరమ్మతు చేస్తే వాగులో నీరు నిల్వ ఉంటుంది. దాంతో భూగర్భ జలాలు పెరిగి ఉపయోగంగా ఉంటుంది.

– సత్యన్న, అయిజ

బావులు ఎండిపోయాయి



అయిజ పెద్దవాగులో చెక్‌డ్యాంలు తెగిపోయినప్పటి నుంచి వాగులో నీరు నిల్వ ఉడకుండా పోయింది. చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయి బోరుబావులన్నీ వట్టిపోయాయి. దాంతో అయిజ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. చెక్ డ్యాంలను పునర్నిర్మిస్తే.. భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

– శ్రీనివాసులు, అయిజ

మరమ్మతు చేపట్టడంలేదు..



చెక్‌డ్యాంలు తెగిపోయి సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. తెగిన చెక్‌డ్యాంలకు మరమ్మతు చేయడానికి ఎక్కువగా డబ్బు ఖర్చుపెట్టాల్సిన పనిలేదు. సైడ్ వాల్స్ మరమ్మతు చేస్తే సరిపోతుంది. సైడ్‌వాల్స్ తెగిపోయి చాలా సంవత్సరాలవుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు.

– రాజు, ఎక్లాస్‌పురం

రాజకీయంగా ఎదగకుండా కుట్ర



గద్వాలలో పాదయాత్ర చేసున్న రంజిత్‌కుమార్

గద్వాల: నడిగడ్డలో జరిగే అక్రమాలు, అవినీతిపై ప్రశ్నించే నాయకులను రాజకీయంగా ఎదగనీయకుండా అణగదొక్కేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ఆరోపించారు. నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర పదో రోజైన ఆదివారం గద్వాల మండలం పూడూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్వాల రాజకీయాలు కేవలం బంగ్లా కుటుంబం చుట్టూనే తిరుగుతున్నాయని, వారి రాజకీయ ఎత్తుగడలో భాగంగా అధికారంలో ఒకరు, ప్రతిపక్షంలో ఒకరూ ఉంటూ రాజకీయాల్ని శాసిస్తున్నారన్నారు. 50 ఏళ్లుగా ఒకే కుటుంబ పాలనలో గద్వాల ప్రజలు నలిగిపోతున్నారని, విద్య, వైద్య రంగాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బినామీలతో మట్టి, ఇసుక, బియ్యం, సీడ్ మాఫీయాతో పాటు భూకబ్జాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిని ఎండగట్టడంలో ప్రధాన ప్రతిపక్ష నాయకులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో కన్వీనర్ బుచ్చిబాబు, ఎర్ర శ్రీను, అవనిశ్రీ, రంగస్వామి, లవన్న, శ్రీనివాస్, వీరేష్, గోవిందు, అంజి, విష్ణు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వర స్వామి ఆలయ సందర్శన

అలంపూర్: మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలోని త్రయంబకేశ్వర ఆలయాన్ని అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, భర్త వెంకటేష్ సందర్శించి దర్శించుకున్నట్లు తెలిపారు. ఆలయ మహత్యాన్ని విశిష్టతను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఆలయాల్లో పరిశుభ్రత, పరిసరాలు, భక్తులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.

అవినీతికి పెద్దపీట

రాజోళి: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు అసంతృప్తి, అసహనంతో ఉన్నారని తెలుగునాడు కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజేంద్ర గౌడ్ అన్నారు. మండల కేంద్రం రాజోళిలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కుర్వ కిష్టన్న ఆధ్వర్యంలో ఆదివారం ఆయన ఇంటింటికి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తమకు రావాల్సిన పథకాలు అందుకోలేకపోతున్నారని, కేసీఆర్ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బీసీలకు, రైతులకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మేలేమి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ ఉమ్మడి మండల మాజీ అధ్యక్షుడు శివకుమార్ గౌడ్, సీనియర్ టీడీపీ నాయకులు రామాంజనేయులు గౌడ్, రావూఫ్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బస్సుయాత్రను విజయవంతం చేయాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సీఐటీయూ నాయకులు, హామాలీ నాయకులు సీపీఎం జన చైతన్య బస్సు యాత్రకు అందరు హాజరై విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఆదివారం జిల్లాకు సీపీఎం జన చైతన్య బస్సు యాత్ర పాత బస్టాండ్‌లోకి వస్తుందన్నారు. సాయంత్రం ఐదున్నర గంటలకు అందరూ అధిక సంఖ్యలో వివిధ పార్టీల, ప్రజా సంఘాలు, సామాజిక సంఘాల నాయకులు హాజరై సభను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శివ, దాసు తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు

- వీధుల్లో గుంపులుగా తిరుగుతూ దాడి
- భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



కేటీదొడ్డి మండల కేంద్రంలో మందలుగా తిరుగుతున్న వీధి కుక్కలు

కేటీదొడ్డి: మండల వ్యాప్తంగా కుక్కల స్వైర విహారానికి ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లోని వందలాది కుక్కలు వీధుల్లో తిరుగుతూ పశువులు, మనుషులపై దాడి చేస్తున్నాయి. పిక్కలు పట్టి పీకుతూ ప్రాణాపాయస్థితి తెస్తున్నాయి. రాత్రి వేళలో మరింతగా జనంపై ఎగబడుతున్నాయి. చిన్నారులు పిల్లలను చూస్తే చాలు వెంటాడుతున్నాయి. చిన్నారులు చేతుల్లోని ఆహార పదార్థాలు లాగేసుకుంటున్నాయి. అందకుంటే వెంటబడుతున్నాయి. కుక్కల దాడితో బాధితులు టీకాల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల వద్దకు పరుగెడుతున్నారు.

జంతు వ్యర్థాలకు రుచిమరిగి...

గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల దుకాణాల యజమానులు వ్యర్థాలను ఊరి బయట పడేస్తున్నారు. వీటి రుచి మరిగిన కుక్కలు నిత్యం మనుషులు, పశువులు, పెంపుడు కోళ్లను వేటాడుతున్నాయి. చీకట్లో వెళ్లే పాదాచారులు, ద్విచక్ర వాహనదారులను సైతం వదలడం లేదు. కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలకు కుక్కలు అడ్డు తగలడంతో వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో వీటి సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

పట్టించుకోని యంత్రాంగం..

గ్రామాల్లో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. ఏళ్ల తరబడి వీటిని అరికట్టేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రజలకు ప్రాణాపాయంగా మారిన కుక్కలను పట్టి అడవుల్లో వదిలేయడం లేదు. ఒకటి రెండు చోట్ల స్థానికులు కుక్కలను పట్టించినా వాటిని ఊరి బయటనే వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్న దాఖలాలు లేవు. కొన్నిచోట్ల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా సర్పంచ్‌లు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించేందుకు ఆసక్తి చూపడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లే సాధారణ విషయంగా వదిలేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదు.

లేగదూడలు.. గొర్రెల మందలపై..

రాత్రి సమయాల్లో కుక్కలు వ్యవసాయ బావుల వద్ద కట్టేసిన లేగదూడలు, గొర్రెల మందలపై దాడులు చేసి చంపితింటున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో కేటీదొడ్డి, వివిధ గ్రామాల్లో 200 గొర్రెపిల్లలు, లేగదూడలపై దాడికి పాల్పడి చంపివేశాయి. కుక్కల బెడదను అరికట్టేందుకు పలుమార్లు అధికారులకు విన్నవించినా పటించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నియంత్రించాలి..



వ్యవసాయ బావుల వద్ద కట్టేసిన లేగదూడ, గొర్రెపిల్లల మందపై రాత్రివేళలో కుక్కలు దాడి చేసి చంపి తింటున్నాయి. ప్రధాన వీధుల్లో గుంపులు, గుంపులుగా కుక్కలు తిరుగుతుండటంతో బయటకు వెళ్లాలంటేనే భయమేస్తుంది. అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలి.

– గోపి, వెంకటాపురం

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎంతైనా ఉందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మల్దకల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. సమావేశానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా ప్రతి గడపగడపకు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమాతో పాటు ఉచిత విద్యుత్‌ను అందిస్తూ.. వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. అంతకు ముందు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, వెంకటన్న, సత్యారెడ్డి, విక్రంసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళన సమావేశానికి హాజరైన కార్యకర్తలు

సభా స్థలి పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంలో ఈ నెల 28న నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభ స్థలాన్ని ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు డా.వి.యం విజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థల ఏర్పాట్లను మండల నాయకులతో కలిసి పరిశీలించి సలహాలు ఇచ్చారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్రాములు, హుస్సేన్, మహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం మండలంలోని సంకాపురంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు కావడంలేదని, అన్ని రాష్ట్రాల ప్రజలు తెలంగాణ వైపు చూస్తున్నారని అన్నారు. ఇటీవల టీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్‌గా మారిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి రోల్ మోడల్‌గా ఉన్నారని అన్నారు. త్వరలో చిన్నోనిపల్లి రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్‌కు లింక్ కాల్వ ఏర్పాటు చేస్తామని, ఆర్డీఎస్ ఆధునీకరణ కోసం రూ.13 కోట్లు నిధులు మంజూరయ్యాయని అన్నారు. తాగునీటితోపాటు రక్షిత మంచినీరును ఇంటింటికీ అందించేందుకు మిషన్ భగీరథ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు గురుకుల పాఠశాలలు, పేద కుటుంబాల్లో అమ్మాయిల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేరున రూ.లక్ష 116 ఇస్తున్నారని, రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కన్జూమర్ ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప మాట్లాడారు. కార్యక్రమానికి సంకాపురం రాముడు అధ్యక్షత వహించగా, సర్పంచ్ సుజాత, ఆర్డీఎస్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి, రఘునాథరెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ధరూరు: మండల పరిధిలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సరిగ్గా 25 ఏళ్ల కిందట కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కరినొకరు కలుసుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఏం చేస్తున్నారు..? ఎక్కడ ఉంటున్నారు..? ఎక్కడ స్థిరపడ్డారు.. ఇలా కుటుంబ నేపథ్యం.. తదితర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు రమేష్ కుమార్, యాదగిరి, దామోదర్, సువర్ణ, హనుమంతు పాల్గొన్నారు.



ఉప్పేరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలి

గట్టు: బీజేపీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేసేందుకు ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని బీజేపీ జిల్లా కోఆర్డినేటర్, శ్యాంరావు కోరారు. ఆదివారం గట్టులో స్వశక్తికరణ్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ శ్యాంరావు మాట్లాడారు. బీజేపీని క్షేత్ర స్థాయి నుంచే బలోపేతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దేశ రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి బూత్ స్థాయిలో ప్రజలకు తెలియజేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో చేసే పనులను రాష్ట్ర స్థాయి వరకు తెలిసేలా గ్రూపుల ద్వారా సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా చేరవేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, మధుసూదన్‌రావు, మండల కోఆర్డినేటర్లు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గట్టులో సమావేశమైన బీజేపీ నాయకులు

మన్‌కీ బాత్‌లో బీజేపీ నాయకులు

శాంతినగర్: ప్రధాన మంత్రి నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగలలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రంజిత్‌పటేల్ గృహంలో ఆదివారం కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహులు, హరికృష్ణ, అయ్యరాజు, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.